# క్రైమ్ THE మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
14-9-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 173

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




మా పాఠకులకు, రిపోర్టర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు

వినాయక చవితి శుభాకాంక్షలు

వినాయక చవితి సందర్భంగా సోమవారం కార్యాలయమునకు సెలవు. కావున మంగళవారం ఎడిషన్ వెలువడదు. పునర్దర్శనం బుధవారం




# కాంగ్రెస్‌కు గ్రేటర్ భయం!

## బల్దియా ఎన్నికలు ప్రతికూలంగా వస్తాయని ఆందోళన

### నిబంధనలకు విరుద్ధంగా వార్డుల విభజన

### ఉద్దేశపూర్వక తప్పిదం అంటున్న ప్రత్యర్థులు

### ఎంత జాప్యం జరిగితే అధికార పార్టీకి అంత నష్టం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల విషయంలో కాంగ్రెస్ వెనక్కి తగ్గిందా? ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే ఉద్దేశం లేదా? పార్టీలో అంతర్గత కుమ్ములాటలు తరుణంలో ఇబ్బందికర ఫలితాలు వస్తాయని భావిస్తోందా? దాటవేత ధోరణి మేలు అన్న నిర్ణయానికి వచ్చిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. అసలు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించే విషయంలో ప్రభుత్వం పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై తెలంగాణ హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది. వార్డుల పునర్విభజన ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేసి.. సరిహద్దులను శాస్త్రీయంగా మళ్ళీ నిర్ణయించే వరకు ఎలాంటి ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వద్దని స్పష్టం చేసింది. అయితే ఇప్పటివరకు ఆ స్టే ఎత్తివేతకు సంబంధించి న్యాయ పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం లేదు.

- మిగతా 2వ పేజీలో

# కవిత టార్గెట్ సిద్ధిపేట!



వచ్చే ఎన్నికల్లో పాగా వేయాలని వ్యూహం

అందుకే తరచూ హరీష్ రావు పై విమర్శలు

తన తండ్రి నియోజకవర్గంలో సత్తా చాటాలన్నదే ఆలోచన

మిగతా 2లో

# ముగిసిన 18వ బ్రిక్స్ సదస్సు..

ప్రపంచ నేతలకు ధన్యవాదాలు తెలిపిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీలో విజయవంతంగా 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు

సహకారంతోనే సవాళ్లను ఎదుర్కోవాలని సభ్య దేశాలకు ప్రధాని మోదీ పిలుపు

తదుపరి బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ప్రకటన

భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేసే న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు కూటమి ఆమోదం



# ఇక పాత రేవంత్!

## ప్రతిపక్ష బెంచ్ స్థాయి దూకుడు

### విపక్షాలకు ధీటైన సమాధానం

### సిరిసిల్ల, గజ్వేలులో భారీ బహిరంగ సభలు

### విపక్షాలకు అక్కడి నుంచే సవాల్

తెలంగాణ సీఎం రేవంత్ దూకుడు పెంచారు. మళ్లీ తన పాత పదును, దూకుడును ప్రారంభించారు. రాజకీయంగా సవాళ్లు కూడా మొదలుపెట్టారు. అందులో భాగంగా గులాబీ పార్టీ ఆధిపత్యం స్పష్టంగా ఉన్న సిరిసిల్ల, గజ్వేల్ వంటి స్థానాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కెసిఆర్,, కేటీఆర్ సొంత నియోజకవర్గాల్లోనే సభలు పెట్టి సవాల్ విసరడం ద్వారా విపక్షాల దాడికి గట్టి కౌంటర్ ఇవ్వాలని చూస్తున్నారు. ఇదే విషయాన్ని నేరుగా ప్రకటించారు.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**

అప్పట్లో చాలా దూకుడు.. కాంగ్రెస్ పార్టీ విపక్షంలో ఉన్నప్పుడు పిసిసి అధ్యక్షుడిగా ఉండేవారు రేవంత్ రెడ్డి. ఆ సమయంలో రాజకీయ దూకుడుతో అధికార పార్టీపై ఓ రేంజ్ లో విరుచుకు పడేవారు. ఇప్పుడు అదే స్థాయి బంచ్ మార్క్ దూకుడును ప్రదర్శించడం అంత సులువు కాదు. ఎందుకంటే అప్పుడు ఏ బాధ్యతలు ఉండేవి కావు. విమర్శలతో రాజకీయ వేడి పుట్టించేవారు. అప్పుడు కేవలం ఆయన ఒక రాజకీయ నాయకుడి మాత్రమే. ఇప్పుడు మాత్రం ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి.

- మిగతా 2వ పేజీలో




# గజ్వేల్‌కు ఉప ఎన్నిక?!

### రాజీనామా చేసే యోచనలో కెసిఆర్

### పదే పదే రేవంత్ సవాల్ తో వ్యూహాత్మక ఎత్తుగడ

### మళ్లీ పాత సెంటిమెంట్ తెరపైకి..

గజ్వేల్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక వస్తుందా? కెసిఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయనున్నారా? తద్వారా బై పోల్ కు తెరతీయనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ఉప ఎన్నికల రాజకీయాల్లో కెసిఆర్ సైని ప్రత్యేక.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఒక రాజీనామాకు సెంటిమెంటును రగిలించి.. దానికి ప్రజామోదం పొంది పార్టీ ఇమేజ్ను ఆకాశానికి ఎత్తే వారు. ఇప్పుడు కూడా అటువంటి ప్రయత్నం చేయనున్నారని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది.

**అదే పనిగా సవాల్..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ కేసీఆర్ కు సవాల్ చేస్తున్నారు. ఫామ్హౌస్కు పరిమితం అవుతున్నారని నిత్యం దాడి చేస్తున్నారు. అయితే దీనిని కేసీఆర్ ఒక అస్త్రంగా మార్చుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే గులాబీ పార్టీకి ఇది ఒక అయాచిత లబ్ధి. రేవంత్ ఈ తరహా విమర్శలు కేవలం రాజకీయ దురుద్దేశంతో చేసినవని..

- మిగతా 2వ పేజీలో

# బొత్స వర్సెస్ గుడివాడ!

వైసీపీలో కొత్త వివాదం

భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతల కోసం మాజీమంత్రి అమర్నాథ్ గట్టి ప్రయత్నం

విశాఖ పై బొత్స ఫ్యామిలీ పట్టు తగ్గించేందుకు భారీ వ్యూహం

2లో





# ఇండోనేషియాలో ఘోర నౌకా ప్రమాదం..

## 130 మంది గల్లంతు

జావా సముద్రంలో మునిగిన ఇండోనేషియా ప్యాసింజర్ నౌక

ప్రమాదంలో 130 మంది గల్లంతు, 6గురు మృతి

107 మందిని సురక్షితంగా కాపాడిన సహాయక బృందాలు

భారీ అలల కారణంగానే నౌక బోల్తా పడిందని వెల్లడి

గల్లంతైన వారి బంధువుల ఆందోళనతో పోర్టు వద్ద ఉద్రిక్తత

2లో

## మంత్రి పదవి పోయిందన్న
# బాధ లేదు..!

తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నానన్న ప్రచారాన్ని కొట్టిపారేసిన కొండా సురేఖ

మంత్రి పదవి పోయినందుకు బాధ లేదు, కానీ కారణం చెప్పకపోవడమే ఆవేదన కలిగించింది

భవిష్యత్తులోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని స్పష్టం చేసిన కొండా దంపతులు

స్థానిక నేతలపై పరోక్షంగా విమర్శలు గుప్పించిన మాజీ మంత్రి

త్వరలో తన భర్త కొండా మురళికి పదవి వస్తుందన్న సంకేతాలు ఉన్నాయని వెల్లడి



తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్టుగా కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ ఫుల్ స్టాప్ పెట్టారు. ఆ వార్తలన్నీ నిరాధారమైనవని, కేవలం కల్పిత కథనాలని ఆమె కొట్టిపారేశారు. తన భర్త కొండా మురళితో కలిసి ఆదివారం వరంగల్‌లో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో

# ఇండోనేషియాలో ఘోర నౌకా ప్రమాదం..

ఇండోనేషియాలో ఘోర నౌకా ప్రమాదం జరిగింది. 213 మంది ప్రయాణికులు, 30 మంది సిబ్బందితో కలిపి మొత్తం 243 మందితో ప్రయాణిస్తున్న 'వర్గో ట్రాన్స్‌పోర్ట్ 8' అనే నౌక జావా సముద్రంలో మునిగిపోయింది. ఈ పెను విషాదంలో ఇప్పటివరకు 107 మందిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడగా, ఆరుగురి మృతదేహాలను వెలికితీశాయి. మరో 130 మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. వారి కోసం సముద్రంలో గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వివరాల్లోకి వెళితే, తూర్పు జావాలోని సురబయ నుంచి శనివారం బయలుదేరిన ఈ నౌక, దక్షిణ కాలిమంటన్‌లోని బంజర్‌మాసిన్‌కు వెళుతోంది. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కెప్టెన్ నుంచి అధికారులకు చివరి సందేశం అందింది. సముద్రంలో దాదాపు 3 మీటర్ల ఎత్తున అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయని, దీంతో




నౌక ఒకవైపునకు ఒరిగిపోతోందని ఆయన తెలిపారు. ఆ తర్వాత కొద్దిసేపటికే నౌకతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. బంజర్‌మాసిన్ రేవుకు సుమారు 148 కిలోమీటర్ల దూరంలో ఈ దుర్ఘటన జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. నౌకాదళానికి చెందిన నౌకతో సహా నాలుగు నౌకలు, ఒక హెలికాప్టర్, సమీపంలోని టగ్‌బోట్ల సహాయంతో గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు. కాపాడిన వారిని సమీపంలోని తూర్పు జావా పోర్టుకు తరలిస్తున్నారు. మరోవైపు, బంజర్‌మాసిన్‌లోని త్రిశక్తి పోర్టు వద్ద గల్లంతైన వారి బంధువులు వందలాదిగా గుమిగూడారు. ప్రయాణికుల జాబితాలను చూస్తూ తమ వారి క్షేమ సమాచారం కోసం తీవ్ర ఆవేదనతో ఎదురుచూస్తున్నారు. వేలాది ద్వీపాలతో కూడిన ఇండోనేషియాలో రవాణాకు ఫెర్రీలపైనే ఎక్కువగా ఆధారపడతారు. అయితే, భద్రతా లోపాల కారణంగా ఇక్కడ తరచూ ఇలాంటి సముద్ర ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. అంతేకాకుండా, అధికారిక రికార్డుల్లో ఉన్న ప్రయాణికుల సంఖ్యకు, వాస్తవంగా నౌకలో ఉన్నవారి సంఖ్యకు తేడా ఉండటం ఇక్కడ సర్వసాధారణమని, దీంతో గల్లంతైన వారి కచ్చితమైన సంఖ్యను నిర్ధారించడం కష్టంగా మారిందని అధికారులు పేర్కొంటున్నారు.

# ఇక పాత రేవంత్!

పాలనాపరమైన సమస్యలు, బడ్జెట్ కేటాయింపులు, గ్యారంటీల అమలు, శాంతి భద్రతల పరిరక్షణ వంటి భారీ బాధ్యతలు ఆయన భుజాలపై ఉన్నాయి. ఒకవైపు పాలనను పరుగులు తీస్తూనే.. మరోవైపు పాత రేవంత్ లాగా రాజకీయంగా విరుచుకు పడడం కత్తి మీద సాము.

**ఆ సమస్యలను అధిగమిస్తూ..**

ఇప్పటికే అనేక సమస్యలు తెలంగాణ ప్రభుత్వానికి వెంటాడుతున్నాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్న ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, విపక్షాలు, రుణమాఫీ, ఉద్యోగాల భర్తీ, హామీల అమలుపై వరుసగా వెళ్ళు వెతుకుతున్న నిరసనలకు రేవంత్ చాలా ఓర్పుగా సమాధానాలు ఇవ్వాల్సి వస్తోంది. ప్రభుత్వం స్థిరపడేందుకు, వ్యవస్థలను చక్కదిద్దేందుకు కొంత సమయం కావాలని ఆయన బతిమలాడుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఒకవైపు సమస్యల కోసం రోడ్లు ఎక్కే వారిని శాంతింప చేస్తూనే.. మరోవైపు విపక్షాలను కట్టడి చేయడం రేవంత్ రెడ్డి ముందున్న కర్తవ్యం. ఈ పొలిటికల్ బ్యాలెన్స్ ను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన ఎంతవరకు సక్సెస్ అవుతారు అనేది చూడాలి.

# ముగిసిన 18వ బ్రిక్స్ సదస్సు..



న్యూఢిల్లీ వేదికగా జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విజయవంతంగా ముగిసింది. ముగింపు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. సదస్సుకు హాజరైన సభ్య దేశాల అధినేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తదుపరి బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిథ్యం ఇవ్వనుండటంతో, ఆ దేశానికి ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి, సమ్మిళిత అభివృద్ధిని సాధించడానికి బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకారం అత్యంత కీలకమని నొక్కి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఘర్షణల వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికత, కీలకమైన ఖనిజాలను కొన్ని శక్తులు ఆయుధాలుగా మార్చుకోవడంపై ఆయన తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. బ్రిక్స్ కూటమి మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న తరుణంలో, ప్రపంచం ఈ కూటమి నుంచి కేవలం ఆలోచనలు, వాగ్దానాలు కాకుండా ఉపయోగకరమైన ఫలితాలను ఆశిస్తోందని మోదీ స్పష్టం చేశారు. ఈ సదస్సులో ఆమోదించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్' కూటమి భవిష్యత్ దార్శనికతకు, పరస్పర సహకారానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్-సిసి, ఇథియోపియా ప్రధాని అబీయ్ అహ్మద్ అలీ, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ వంటి పలువురు దేశాధినేతలు పాల్గొన్నారు. వీరితో పాటు ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, పలు దేశాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

# గజ్వేల్‌కు ఉప ఎన్నిక?!

(మొదటి పేజీ తరువాయి)

తరచూ తనను అవమానిస్తున్నారంటూ కేసిఆర్ నిజంగా గజ్వేల్ స్థానానికి రాజీనామా చేసి.. ఉప ఎన్నికలకు వెళ్తే తెలంగాణలో రాజకీయ సమరం పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది.

**ఉప ఎన్నిక రాజకీయంతోనే..**

కెసిఆర్ తన పార్టీ ప్రస్థానాన్ని పరిశీలిస్తే.. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ఉప ఎన్నికల రాజకీయ ఫైలిని అనుసరించారు. ఉన్న పదవులకు రాజీనామా చేయించి.. వాటికి సెంటిమెంటు తగిలించి.. చివరకు ప్రజామోదం పొంది పార్టీ ఇమేజ్ను పెంచుకునేవారు. అందుకే ఇప్పుడు రేవంత్ విసిరిన సవాల్ స్వీకరించి.. కెసిఆర్ గజ్వేల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలన్న ఆలోచనకు వస్తున్నట్లు తెలుస్తోంది. పైగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంది. తన రాజీనామా చేసి ఈ ప్రభుత్వ పాలనకు రెఫరండంగా తీసుకుంటే పూర్తిగా పరిస్థితి మారిపోనుంది. కాంగ్రెస్ నన్ను అవమానిస్తోంది. మళ్లీ నేను మీ తీర్పు కోరుతున్న అని కేసిఆర్ ప్రజాక్షేత్రంలోకి వస్తే.. గులాబీ పార్టీ శ్రేణుల్లో మునుపటి ఉద్యమ స్ఫూర్తి రగిలే అవకాశం ఉంది.

**ఆ ధైర్యం చేయగలరా..**

అయితే గులాబీ పార్టీ అంత ధైర్యం చేయగలదా అనేది ఇప్పుడు అనుమానం. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా ఆ పార్టీ ఓడిపోయింది. ఒకవేళ కెసిఆర్ రాజీనామా చేసి బైపోల్ కు వెళ్లి.. పొరపాటున ఓడిపోతే అక్కడ పరిస్థితి ఏంటనేది ఆ పార్టీలో నెలకొన్న భయం. అధికారంలో ఉన్న కాంగ్రెస్ తన యంత్రాంగాన్ని, సంక్షేమ హామీలను ఉపయోగించి గజ్వేల్ ను దక్కించుకోవడానికి ఎలాగూ తీవ్ర ప్రయత్నం చేస్తుంది. కేవలం గులాబీ పార్టీని ఆత్మరక్షణలో పడేయాలన్న ఆలోచనలో రేవంత్ ఉన్నారు. ఒకవేళ కెసిఆర్ బైపోల్ కు వెళ్లి గెలిచినా ఇప్పటికీ ఇప్పుడు రేవంత్ కు వచ్చే ఇబ్బంది లేదు. కెసిఆర్ ఓడిపోతే మాత్రం రేవంత్ తెలంగాణ సమాజంలో హీరో అవుతారు. సొంత పార్టీలోనూ స్ట్రాంగ్ అవుతారు.



# కవిత టార్గెట్ సిద్దిపేట!

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** వచ్చే ఎన్నికల్లో కవిత సిద్దిపేట నుంచి పోటీ చేస్తారా? ఆ మేరకు సంకేతాలు ఇచ్చారా? దమ్ముంటే హరీష్ రావు భార్యను తనపై పోటీ చేయాలన్న సవాల్ వెనుక అసలు కారణం అదేనా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. అంతటితో ఆగకుండా వచ్చే ఎన్నికల్లో తాను సిద్దిపేట లేదా బోధన్ నియోజకవర్గాల నుంచి శాసనసభకు పోటీ చేస్తానని స్పష్టమైన ప్రకటన చేశారు కవిత. అయితే ఈ ప్రకటన వెనుక కవిత టార్గెట్ హరీష్ రావు అని స్పష్టంగా అర్థమవుతోంది. తన తండ్రి సుదీర్ఘకాలం ప్రాతినిధ్యం వహించిన సిద్దిపేట ను ఎలాగైనా హస్తగతం చేసుకోవాలన్న ఆలోచనతో ఆమె ఉన్నట్లు తెలుస్తోంది.

**ఆ ఇద్దరిపైనే గురి..**

గులాబీ పార్టీ నుంచి సస్పెండ్ అయిన తర్వాత కవిత ప్రధానంగా హరీష్ రావు, సంతోష్ రావులపై మాత్రమే ఆరోపణలు చేస్తుండగా.. ఇటీవల మాజీ మంత్రి వేముల ప్రశాంతి రెడ్డి మీద కూడా టార్గెట్ చేశారు. తాను భవిష్యత్తులో హరీష్ రావును క్షమించినా.. జీవితంలో ప్రశాంత్ రెడ్డిని మాత్రం క్షమించమని చెప్పారు. కాలేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడి కెసిఆర్ కు అవినీతి మరకలు అంటించిన ఘనత హరీష్ రావు, సంతోష్ రావులకే దక్కుతుందని మరోసారి పునరుద్ఘాటించారు కవిత.

**బిజెపితో ఒప్పందం..**

భారతీయ జనతా పార్టీతో హరీష్ రావు రహస్య ఒప్పందం చేసుకున్నారని కవిత ఆరోపిస్తూ వచ్చారు. తాజాగా కూడా అటువంటి ఆరోపణ చేశారు. తన కుటుంబంలో విభేదాలు సృష్టించడంలో ప్రధాన కుట్ర గారు హరీష్ రావు అని.. ఆయన విషయంలో జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్ తో పాటు కేసిఆర్ కు హెచ్చరిస్తూ వచ్చారు. కవిత నుంచి ఈ స్థాయిలో ఆరోపణలు వస్తున్నా హరీష్ రావు మాత్రం పెద్దగా స్పందించడం లేదు. వాస్తవానికి హరీష్ రావు పై ఇతర ఆరోపణలు చేశారన్న అంశంతోనే ఆమెపై గులాబీ పార్టీ హైకమాండ్ వేటు వేసింది. పార్టీ నుంచి బయటకు వచ్చి కొత్త పార్టీని ఏర్పాటు చేసుకున్న కవిత ఇప్పుడు కూడా హరీష్ రావు నే టార్గెట్ చేస్తున్నారు. ఏకంగా తనపై పోటీకి దింపాలని హరీష్ రావు భార్యకు సైతం పిలుపునిచ్చారు అంటే ఏ స్థాయిలో కోపం ఉందో అర్థం అవుతుంది. కచ్చితంగా సిద్దిపేటలో పట్టు బిగించాలన్నది ఆమె ఆలోచన. మరి అందులో ఆమె ఎంతవరకు సక్సెస్ అవుతారో చూడాలి.

# మంత్రి పదవి పోయిందన్న బాధ లేదు..!

ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "మేము కాంగ్రెస్‌లోనే పుట్టాం, కాంగ్రెస్‌లోనే పెరిగాం. మాకు వేరే పార్టీలోకి వెళ్లాలనే ఆలోచన లేదు" అని కొండా సురేఖ తేల్చిచెప్పారు. గతంలో కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌లోకి వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. తమను ఎవరూ బయటకు పంపలేదని గుర్తుచేశారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మంత్రివర్గం నుంచి తనను తొలగించడంపై మాట్లాడుతూ.. పదవి పోయినందుకు వ్యక్తిగతంగా ఎలాంటి బాధ లేదని, కానీ ఎందుకు తొలగించారో కారణం చెప్పకపోవడం ఆవేదన కలిగించిందని అన్నారు. మంత్రి పదవి ఒక అలంకారం మాత్రమేనని, తనకు అప్పగించిన మూడు శాఖలను ఎలాంటి అవినీతికి తావులేకుండా నడిపించానని తెలిపారు. పార్టీ మార్పు ప్రచారం నేపథ్యంలో అధిష్ఠానం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, తాను పార్టీ వీడటం లేదని వారికి స్పష్టం చేశానని సురేఖ వెల్లడించారు. ఈ క్రమంలో తన భర్త కొండా మురళికి త్వరలో పదవి ఇస్తామనే సంకేతాలు కూడా అధిష్ఠానం నుంచి వచ్చాయని ఆమె తెలిపారు. రానున్న ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున మళ్లీ గెలిచి, మంత్రిగా తిరిగి వస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 24 నుంచి 25 డివిజన్లలో కాంగ్రెస్‌ను గెలిపించడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలపై ఆమె పరోక్షంగా విమర్శలు గుప్పించారు. కనీసం కార్పొరేటర్‌గా కూడా గెలవలేని వారు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్ మరణం తర్వాత స్థానికంగా ఉన్న కొందరు "గుంటనక్కలు" తమను మోసం చేశారని ఆరోపించారు. అప్పటి మంత్రిని ఓడించేందుకే కేసీఆర్ తనకు వరంగల్ తూర్పు టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. తాము పరకాలను వీడిన తర్వాత చల్లా ధర్మారెడ్డి అక్రమంగా డబ్బు సంపాదించారని కూడా సురేఖ ఆరోపణలు చేశారు.

# కాంగ్రెస్‌కు గ్రేటర్ భయం!



ఆ ఊపు కొనసాగించి ఉంటే.. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల లో కాంగ్రెస్ పార్టీ చక్కటి ఫలితాలను పొందింది. అదే ఊపుతో కొనసాగించి ఉంటే గ్రేటర్ సైతం కాంగ్రెస్ పార్టీకి చిక్కేది. చాలా ఆలస్యం చేసింది. కోర్టులో సైతం చిక్కుముడులు అధికం అవుతున్నాయి. అయితే ఈ వివాదానికి ప్రధాన కారణం జిహెచ్ఎంసి చేపట్టిన వార్డుల విభజన ప్రక్రియలో జరిగిన నిబంధనల ఉల్లంఘనలే. ఈ అంశంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టు విచారణ జరిపింది. ఇప్పటివరకు ఉన్న రూల్స్ ప్రకారం ప్రతి వార్డు పరిధిలోని జనాభా ప్రాతిపదికన మాత్రమే సరిహద్దుల నిర్ణయం జరగాలి. కానీ ప్రస్తుతం చేసిన పునర్విభజన జనాభా సమతుల్యతను దెబ్బతీసేలా ఉండడమే కాకుండా.. తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి విరుద్ధంగా ఉందంటూ ఆధారాలతో సహా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు పిటిషనర్లు. అయితే ఈ న్యాయ చిక్కుముడులపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. ఉద్దేశపూర్వక జాప్యం కోసమే ప్రభుత్వం అలా చేస్తుందనేది ప్రధాన ఆరోపణ.

**గ్రేటర్ లో వ్యతిరేకత..:** గ్రేటర్ ఎన్నికలను ఎంత ఆలస్యం చేస్తే కాంగ్రెస్ పార్టీకి అంత నష్టం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నంత పట్టు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి లేదు. హైడ్రా కూల్చివేతలు, ఆస్తుల క్రమబద్ధీకరణ, మూసి ప్రక్షాళన ప్రాజెక్టుల వల్ల ఉత్పన్నమైన ప్రజాగ్రహం ఎన్నికల్లో తమపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే భయం అధికార పక్షాన్ని వెంటాడుతోంది. ఈ పొలిటికల్ రిస్క్ ను ముందే ఊహించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కావాలనే వార్డుల విభజనను అస్తవ్యస్తంగా జరిపిందనేది ప్రత్యర్థుల ఆరోపణ. నిబంధనలకు విరుద్ధంగా వార్డుల విభజన చేస్తే విపక్షాలు కచ్చితంగా కోర్టుకు వెళ్తాయి. ఆ విధంగా ఎన్నికలు వాయిదా పడితే తమకు మరింత సమయం దొరుకుతుందనే ఎత్తుగడతోనే ప్రభుత్వం ఈ వివాదాస్పద రీతిలో అడుగులు వేసిందని పొలిటికల్ విశ్లేషకులు భావిస్తున్నారు.

# బొత్స వర్సెస్ గుడివాడ!

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** ఉత్తరాంధ్రలో కీలక రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్రంగా జరుగుతున్న రాజకీయాలు హీట్ పుట్టిస్తున్నాయి. చిన్న శ్రీను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పడంతో ఒక్కసారిగా పరిణామాలు మారిపోతున్నాయి. ఇప్పటివరకు విశాఖ జిల్లా పై దృష్టి పెట్టిన బొత్స.. ఇకనుంచి విజయనగరం జిల్లా పై ప్రత్యేకంగా ఫోకస్ చేయాల్సిన పరిస్థితి. అదే సమయంలో ఇప్పుడు విశాఖ వైసిపి నేతలు శరవేగంగా పావులు కదుపుతున్నారు. భీమిలి విశాఖ వైసిపి ఇన్చార్జ్ బాధ్యతలు జిల్లా నేతలకు ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది. ప్రధానంగా విశాఖ జిల్లాలో బొత్స వద్దు అన్న డిమాండ్ తెరపైకి తెస్తున్నారు మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్.

**ప్రస్తుతం చోడవరం ఇన్చార్జిగా..**

ప్రస్తుతం చోడవరం వైసీపీ ఇన్చార్జిగా ఉన్నారు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్. అక్కడ ఇన్చార్జిగా ఉండేందుకు ఆయన పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఎందుకంటే అక్కడ కరణం ధర్మశ్రీ ప్రాబల్యం ఎక్కువ. 2019 ఎన్నికల్లో ధర్మ శ్రీ అక్కడి నుంచి గెలిచారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత గాజువాక నుంచి పోటీ చేసిన గుడివాడ అమర్నాథ్ ను చోడవరం నియోజకవర్గానికి పంపించారు. అక్కడ ఉన్న కరణం ధర్మశ్రీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బాధ్యతలను చూస్తున్నారు. అయితే ఆ ఇద్దరూ నేతలు అయిష్టంగానే



ఉన్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలను పాటించక తప్పడం లేదు వారిద్దరికీ. అయితే ఇప్పుడు భీమిలి నియోజకవర్గం ఇన్చార్జిగా ఉన్న చిన్న శ్రీను పార్టీకి గుడ్ బై చెప్పడంతో.. ఖాళీ అయిన ఆ స్థానాన్ని తనకు ఇవ్వాలని కోరుతున్నారు గుడివాడ అమర్నాథ్.

**అవంతి రాజీనామాతో..**

2019 ఎన్నికల్లో భీమిలి నుంచి పోటీ చేశారు అవంతి శ్రీనివాస్. ఎన్నికల్లో అవంతి శ్రీనివాస్ గెలవడంతో తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు జగన్. 2024 ఎన్నికల్లో కూడా మరోసారి అవంతి శ్రీనివాస్ కు టికెట్ దక్కింది. కానీ ఎన్నికల్లో ఓడిపోయేసరికి అవంతి శ్రీనివాస్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. అయితే ఆ సమయంలో విజయనగరం జడ్పీ చైర్మన్ గా ఉన్న చిన్న శ్రీను కు ఆ బాధ్యతలు కట్టబెట్టారు. అయితే అదే ఎన్నికల్లో గాజువాక నుంచి పోటీ చేసి ఓడిపోయిన గుడివాడ అమర్నాథ్ కు ఏ నియోజకవర్గ బాధ్యతలు లేకుండా పోయాయి. అవంతి శ్రీనివాస్ వైసీపీకి గుడ్ బై చెప్పడంతో భీమిలిపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు గుడివాడ అమర్నాథ్. కానీ అమర్నాథ్ను కాదని బొత్స ఒత్తిడితో చిన్న శ్రీనుకు బాధ్యతలు కట్టబెట్టారు జగన్. ఈ పరిణామాలతో మనస్థాపానికి గురైన గుడివాడ అమర్నాథ్కు చోడవరం ను సర్దుబాటు చేశారు. చోడవరం లో ఉన్న ధర్మశ్రీని తీసుకొచ్చి అనకాపల్లి బాధ్యతలను అప్పగించారు.

**భీమిలి కోసం పట్టు..**

అయితే ఇప్పుడు చిన్న శ్రీను రాజీనామాతో భీమిలి ఖాళీ అయింది. ఆ స్థానాన్ని జిల్లా వాసులకి అప్పగించాలన్న డిమాండ్ పెరుగుతోంది. భీమిలి నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలు తనకు అప్పగించాలని ఇప్పుడు మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ కోరుతున్నారు. అదే సమయంలో పక్క జిల్లాకు చెందిన బొత్స ను విశాఖ నుంచి తప్పించాలని కూడా తెరవెనుక పావులు కదుపుతున్నారు. ఇకనుంచి బొత్స ఫ్యామిలీ విశాఖ జిల్లాలో వేలు పెట్టకుండా చూడాలని అమర్నాథ్ ఒక వర్గంగా ఏర్పడి ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఒకవేళ భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి పోస్ట్ గుడివాడ అమర్నాథ్ దక్కించుకుంటే.. విశాఖలో బొత్సకు ఇబ్బందులు తప్పవు. చిన్న శ్రీను రాజీనామాతో ఆయన విజయనగరం పై దృష్టి పెట్టడమే కాదు.. విశాఖ బాధ్యతలు కూడా వదులుకోవాల్సి ఉంటుంది. అంతలా పావులు కదుపుతున్నారు గుడివాడ అమర్నాథ్.

క్రైమ్ మిర్రర్ Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
సోమవారం 14-9-2026


# రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలి

## తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు

## వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు ఆర్థిక సాయం తక్షణమే అందించాలి

## సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కె.వి రామిరెడ్డి డిమాండ్



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** రైతులకు నాణ్యమైన విద్యుత్ ను నిరంతరాయంగా అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి 12,000 రూపాయల ఆర్థిక సహకారాన్ని తక్షణమే అందించాలని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కె.వి రామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం స్థానిక సిపిఐఎం కార్యాలయం రావేల సత్యనారాయణ భవనంలో పార్టీ సీనియర్ నాయకులు మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమరజీవి సీతారాం ఏచూరి తెలంగాణ రైతు సంఘం నేత సిపిఐఎం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభను తెలంగాణ రైతు సంఘం, పార్టీ మండల కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దండ సైదారావు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ ఎలినినో ప్రభావంతో సకాలంలో వర్షాలు లేక రైతులు సాగు చేసిన పంటలు నిలువునా ఎండిపోతున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు సరిపోక బోర్లు బావులు కింద మాత్రమే అరకొరగా సాగుచేసిన పంటలకు కూడా ప్రభుత్వం నాణ్యమైన 24 గంటల విద్యుత్ను నిరంతరాయంగా అందించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఎరువులు పంపిణీకి నూతనంగా ఫెర్టిలైజర్ యాప్ ను తీసుకురావడంతో, సాంకేతిక కారణాలతో పాటు యాప్ ను ఉపయోగించడంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నూతనంగా తీసుకొచ్చిన ఫెర్టిలైజర్ యాప్ ను తక్షణమే రద్దుచేసి రైతులకు అవసరమైన యూరియా ఇతర ఎరువులను పాసు పుస్తకాల ఆధారంగా నేరుగా అందించాలని, 24 గంటల నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా అందించి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. వ్యవసాయ సాగులో యాంత్రికరణ పెరిగిన నేపథ్యంలో వ్యవసాయ కూలీలకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూలీలకు ఉపాధి భద్రత కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధి హామీ పనులను కూడా సక్రమంగా కల్పించకపోవడంతో కూలీలు ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణమే కూలీలకు ఉపాధి హామీ పని కల్పించి, ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి 12 వేల ఆర్థిక సాయాన్ని అందించే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె రాణి, పుష్పలత, చెరువు నరసింహారావు, బి నాగేశ్వరరావు, పూర్ణచంద్రప్రసాద్, జమాల్, మైకు బాబు, రహీమ్, రంజిత్ కుమార్, తానీషా, పెదపాక మల్లేశ్వరరావు, సామల మల్లికార్జున్, తిరపమ్మ, మంకెనపల్లి నరసింహారావు, ఏలూరి కోదండ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# తేజ హెల్పింగ్ హ్యాండ్స్ వారి సహకారంతో సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల విగ్రహాల పంపిణీ

## మట్టి వినాయకుల సంస్థాన్ నారాయణపురం గా తీర్చిదిద్దుతాం





**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని స్థానిక చౌరస్తాలో తేజ హెల్పింగ్ హాండ్స్ హైదరాబాద్ వారి సహకారంతో,స్థానిక సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి విగ్రహాలు భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తేజ హెల్పింగ్ హాండ్స్ వారు మాట్లాడుతూ వచ్చే సంవత్సరం సంస్థాన్ నారాయణపురం గ్రామంలో సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి ఒక్క మండపంలో మట్టి విగ్రహాలని అందిస్తాము అని అన్నారు అదేవిధంగా వచ్చే సంవత్సరం వినాయక చవితి పండగకు పిఓపి విగ్రహాలని వాడకుండా మట్టి వినాయకుల సంస్థాన్ నారాయణపురం గా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో తేజ హెల్పింగ్ హాండ్స్ సమస్త సభ్యులు, నారాయణపురం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బద్దుల మురళి యాదవ్, పిఎసి డైరెక్టర్ ఉప్పల కృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాచకొండ రమేష్ బాబు, కాంగ్రెస్ పార్టీ సహాయ కార్యదర్శి రేవనపల్లి గోపాల్, మారగోని శంకర్ గౌడ్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, విలేకరులు కొండా శ్రీకాంత్ గౌడ్, ఉప్పల వెంకటేష్, చిలువేరు సంజీవ, కొత్త బాలరాజ్ గౌడ్,చిలివేరు సైదులు,రాపర్తి బుచ్చయ్య గౌడ్, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దగోనిగిరి గౌడ్, బానోతు కిరణ్ నాయక్, గణేష్ నాయక్,వడ్డేపల్లి ప్రసాద్, గ్రామ ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణహిత మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించాలి

## కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్, ఖమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్

**బాలానగర్, సెప్టెంబర్ 13 (క్రైమ్ మిర్రర్) :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ కోసం జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ సూచనల మేరకు బాలానగర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఆదివారం రాజు కలని గాంధీ బొమ్మ వద్ద ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్, ఖమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, కూకట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, బాలానగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శివ కుమార్ గౌడ్ హాజరై విగ్రహాల పంపిణి చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ నగరంలో పర్యావరణహిత మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించడాని కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో మాదిరిగానే స్థానిక మున్సిపల్, పర్యావరణ శాఖ లేదా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉచిత మట్టి విగ్రహాలను పెద్ద ఎత్తున పంపిణీ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు పులి శ్రీకాంత్ పటేల్, అధికార ప్రతినిధి మధు మోహన్, సీనియర్ నాయకులు సత్యాపల్ రెడ్డి, మహంకాళి శ్రీనివాస్, శ్రీకాంత్ గౌడ్, సదా గౌడ్, దండు రవి గౌడ్, జల్లా శివ, జావీద్, భారత్, మహిళా నాయకురాలు సాయి భారతి, పద్మావతి, ఊర్మిళ, శ్రేమలత తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

## ఎమ్మెల్యే, పి ఏ సి చైర్మన్ అరికెపూడి గాంధీ



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 13 (క్రైమ్ మిర్రర్) :** పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ ప్రజలకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఎస్సీ చైర్మన్ అరికెపూడి గాంధీ ఆదేశాల మేరకు గత పది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురంధర్ రెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా కాలనీ ప్రజలు పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గత పదేళ్లుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, మట్టి విగ్రహాల వినియోగం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను వినియోగించి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఆర్. రామచంద్రరావు, లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ, నర్సింగ్‌రావు, వెంకటేశ్వరరావు, సుధాకర్, సుబ్బారెడ్డి, నందు, అశ్విత్, రోహిత్, కళ్యాణ్ తదితరులు పాల్గొని కాలనీ ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

# మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

## గణేష్ ఉత్సవాల్లో డీజేలు వేస్తే కఠిన చర్యలు

## వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

## హుజూర్ నగర్ సీఐ చరమంద రాజు




**క్రైమ్ మిర్రర్,హుజూర్‌నగర్:** పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని హుజూర్ నగర్ సీఐ చరమంద రాజు ప్రజలను కోరారు. వినాయక చవితి పండుగను హుజూర్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలనీ పిలుపునిచ్చారు. సర్కిల్ పరిధిలోని ఎస్సైలతో కలిసి విడుదల చేసిన ఒక వీడియో ద్వారా ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు.

**మట్టి గణపతులకే ప్రాధాన్యం**

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ రసాయన రంగుల విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులనే పూజించాలనీ,నీటి కాలుష్యం ను నివారించాలని,వర్షాభావం వల్ల చెరువులు, కుంటల్లో నీటి మట్టం తగ్గింది. రంగుల విగ్రహాల వల్ల నీరు కలుషితమై తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని కోరారు.

**డీజేలపై నిషేధం**

శబ్ద కాలుష్య నివారణకు డీజే లను పూర్తిగా నిషేధించారు. మండపాల వద్ద ఎటువంటి నిబంధనల ఉల్లంఘన జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు.జిల్లా ఎస్పీ జారీ చేసిన అన్ని మార్గదర్శకాలను మండప నిర్వాహకులు తు.చ. తప్పకుండా పాటించి పోలీసులకు సహకరించాలనీ ఈ సందర్భంగా కోరారు.

**నిమజ్జనం వేలా జాగ్రత్తలు తీసుకోవాలి**

విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రభుత్వం, స్థానిక సంస్థలు నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని కోరారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి, సౌభాగ్యం కలగాలని సీఐ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాలకవీడు ఎస్ఐ కోటేష్, నేరేడుచర్ల ఎస్ఐ గోపాల్ రెడ్డి, గరిడేపల్లి ఎస్ఐ శ్రీకాంత్, మఠంపల్లి ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఊర్కొండలో జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు

## 300 మందికి పైగా క్రీడాకారుల హాజరు.. రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఊర్కొండ):** నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఊర్కొండ మండల కేంద్రంలో ఆదివారం జూనియర్ బాలురు, బాలికలు, సబ్‌జూనియర్ బాలికల జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్, గ్రామ సర్పంచ్ మంజుల శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. జిల్లాలోని 20 మండలాల నుంచి సుమారు 300 మందికి పైగా క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొన్నారు. ప్రతిభ ఆధారంగా ఉత్తమ క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన జూనియర్ బాలురు, సబ్‌జూనియర్ బాలికల జట్లు ఈ నెల 26 నుంచి 29 వరకు సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా తరఫున పాల్గొంటాయని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్ తెలిపారు. జూనియర్ బాలికల జట్టు వచ్చే నెల 10 నుంచి 13 వరకు ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందని పేర్కొన్నారు.క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నామని, ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మేకల శ్రీనివాసులు, రమేష్, డాక్టర్ క్యామోహన్, ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు జ్యోతి, భారతి, గణేశ్వరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption



# ఎంపీ వద్దిరాజు వినాయక చవితి సందర్భంగా తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** వినాయక చవితి పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఏ శుభకార్యం మొదలుపెట్టినా ముందుగా గణపతిని పూజించడం మన సంప్రదాయం అని తలపెట్టిన కార్యం నిర్విఘ్నంగా విజయవంతంగా సాగాలంటే విఘ్న నాయకుడైన శ్రీగణేశుని అనుగ్రహం కావలసిందేనన్నారు.అందుకే దైవారాధనలో పూజా కార్యక్రమాలలో సర్వ శుభకార్యాల ప్రారంభంలో తొలి పూజలందుకునే దైవం వినాయకుడేనని ఎంపీ రవిచంద్ర తన సందేశంలో పేర్కొన్నారు."గణపతిని వేదాలు కొలిచాయి. బ్రహ్మజ్ఞానాన్ని, విష్ణు తత్వాన్ని, శివశక్తినీ తనలో ఇముడ్చుకున్న త్రిమూర్తి అంశంగా పూజిస్తారు"అని చెప్పారు."జైజై గణేశా.. జయమునివ్వు గణేశా!అంటూ దేశమంతటా ప్రపంచం నలుమూలల



ఉన్న హైంధవులు భక్తిప్రపత్తులతో గణనాథుడికి తొమ్మిది రోజుల పాటు పూజలు చేస్తారని ఎంపీ రవిచంద్ర చెప్పారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గొప్ప దైవ భక్తులు గణేష్ మండపాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులతో పాటు ఉచితంగా సదుపాయాలు కల్పించి నిమజ్జనం శోభాయాత్ర సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా పకడ్బంధీగా చర్యలు తీసుకునేవారని కొనియాడారు. భావితరాలకు సురక్షితమైన పర్యావరణం కోసం మనమందరం కంకణబద్ధులమై"ఎకో ఫ్రెండ్లీ" వినాయకుడిని (మట్టితో చేసిన గణపతి) పూజిద్దాం అని ఎంపీ రవిచంద్ర పిలుపునిచ్చారు. విఘ్నేశ్వరుడి కృపా కటాక్షాలతో విఘ్నాలన్నీ కూడా తొలిగిపోయి ప్రజలందరికి సకల శుభాలు కలిగి ఆయురారోగ్యాలతో విజయాలు చేకూరి కొత్త వెలుగులు నిండాలని ప్రశాంతతను ప్రసాదించాలని ఎంపీ వద్దిరాజు ప్రార్థిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు.

## రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి తుమ్మల....



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** రాష్ట్ర ప్రజలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఏర్పడే సకల విఘ్నాలను ఆ వినాయకుడు తొలగించాలని పరమ పవిత్రమైన వినాయక చవితి పర్వదినం సందర్భంగా మనమందరం ఇళ్లల్లో మట్టి వినాయకుడిని పూజిద్దామని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. మట్టి వినాయకుడిని పూజించటం పర్యావరణానికి మేలు చేయటంతో పాటు మన సంస్కృతిని కాపాడుకుందాం అని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ వినాయక చవితి తెలుగు ప్రజలు అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నానని మంత్రి తుమ్మల తన శుభాకాంక్షలు తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఎస్ ఆర్ అండ్ బి జి ఎన్ ర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఖమ్మం 1981, 1984 బి.ఏ ఈ.పీ.పీ బ్యాచ్ విద్యార్థుల 4వ ఆత్మీయ సమ్మేళనం ఖమ్మం జూబ్లీ క్లబ్ నందు ఆనందదాయకంగా నిర్వహించడం జరిగినది. 40 మంది బ్రాంచ్ మేట్స్ హాజరైనారు వీరిలో నలుగురు మహిళలు హాజరైనారు. మహిళలకు గౌరవపూర్వకంగా శారీస్ అందరి తరపున బహుకరించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జూబ్లీ క్లబ్ సెక్రటరీ మోత్కూర్ నాగేశ్వరరావు హాజరయ్యారు వారికి ఆత్మీయ సన్మానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో హరినాథ్ సుదర్శన్, జమీల్, శ్రీహరి, నరసయ్య, రౌత్ రవి,బాబు ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులుగా వ్యవహరించారు

## భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** పర్యావరణ పరిరక్షణ తమవంతు కృషి గా నేలకొండపల్లి భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండల ప్రజలకు మట్టి గణపతి ప్రతిమను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో భక్తి రామదాసు సర్వీస్ సొసైటీ నాయకులు గణపతి రావు యల్లమద్ది లెనిన్ ఉపసర్పంచ్ మద్దనేని మహేష్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు కొమ్మూరి నరేష్ శ్రీను కాసీమ్ గెల్లా జగన్ మోహన్ రావు చారి కనుపర్తి కోటేశ్వరరావు యల్లపంల్లి శ్రీను పాల్గొన్నారు

## మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేసిన లార్డ్స్ జాయ్ హైస్కూల్ విద్యార్థులు



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్)** పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ లార్డ్స్ జాయ్ హై స్కూల్ ఆధ్వర్యంలో ఆర్.ఎన్.రెడ్డి ప్రాంతంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన పర్యావరణహిత వినాయకుల ర్యాలీలో చైర్మన్ సిద్ధాల బీరప్ప, వైస్ చైర్మన్ బీర్లు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ సిద్ధాల శ్రీలత, డీన్ సతీష్ కుమార్ పాల్గొన్నారు. ర్యాలీలో విద్యార్థులతో కలిసి చైర్మన్ సిద్ధాల బీరప్ప ప్రజలకు మట్టి వినాయకులను స్వయంగా పంపిణీ చేశారు. ప్రకృతికి హాని కలిగించని మట్టి వినాయకులను పూజించాలని ప్రజలకు విద్యార్థులు అవగాహన కల్పించారు. విద్యార్థులను ఇటువంటి సామాజిక, పర్యావరణ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడంలో ప్రిన్సిపల్ బలం శివనీలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మట్టి వినాయకుడు పర్యావరణ పరిరక్షణకు మన వంతు బాధ్యత అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజలను ఆకట్టుకుంది.

# నెల నెల వైద్య శిబిరం విజయవంతం

### 256 మంది రోగులకు వైద్య సేవలు

### ఎన్.జి.ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి కె.వి రామిరెడ్డి





**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర ఫౌండేషన్ (ఎన్జీఆర్) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ళ సత్యనారాయణ భవనంలో నిర్వహించిన 45వ నెల నెలా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 256 మంది రోగులకు డాక్టర్లు వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో 127 మంది షుగర్, బీపీ పేషెంట్లకు, 60 మందికి కంటి వైద్య పరీక్షలు, 22 మందికి దంత వైద్య సేవలను డాక్టర్లు అందించారు. ఎలమద్ది హాస్పిటల్ కు చెందిన డాక్టర్ రాజేష్ ఎండి, (జనరల్ ఫిజీషియన్), సాయి కేర్ దంత వైద్యశాలకు చెందిన డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ హస్నాద్ బాబా ఎంబిబిఎస్, కంప్యూటర్ టెక్నాలజీతో కంటి వైద్య సేవలు అందించిన ఖమ్మం శరత్ మ్యాక్స్ విజన్ వారికి ఎన్జీఆర్ ఫౌండేషన్ కోశాధికారి గుడవర్తి నాగేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు బీపీ చెక్ అప్ చేయడంలో సహకరించిన గ్రామీణ వైద్యులు బండి పుష్పలత, బండారుపల్లి నాగేశ్వరరావు, షేక్ తానేషా, వసుంధర ఒకేషనల్ కాలేజీ విద్యార్థినులకు, ల్యాబ్ టెక్నీషియన్ ఈగ అనిల్ కుమార్, వైద్య సేవలు అందించిన వాలంటీర్ల బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో వైద్యం అత్యంత ఖరీదైన నేపథ్యంలో ప్రతి పేదవానికి కార్పొరేట్ వైద్యానికి ధీటుగా సేవలు అందించాలనే లక్ష్యంతో సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో ఉద్యమాలకే పరిమితం కాకుండా ఎన్జీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వైద్య సేవలతో విద్యార్థులు, యువతకు కంప్యూటర్ శిక్షణ, కుట్టు మిషన్ శిక్షణ వంటి అనేక సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నాము. ఎన్జీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినెల నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. వైద్య శిబిరంలో రోగులకు బిపి, షుగర్, గ్యాస్టిక్ సమస్యలకు అవసరమైన మందులను కేవలం 100 రూపాయలకే అందిస్తున్నామన్నారు. ప్రతి నెల రెండవ ఆదివారం జరుగుతున్న వైద్య శిబిరంలో బిపి, షుగర్, గ్యాస్టిక్ సమస్యలతో పాటు ఇతర సాధారణ జబ్బులకు కూడా డాక్టర్ వైద్య సేవలు అందిస్తారన్నారు. ప్రతినెల నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ప్రసాద్, షేక్ జమాల్, కొంగర నారాయణరావు, షేక్ రహీమ్, షేక్ అబ్దుల్, పి మల్లేశ్వరరావు, డి సైదారావు, ఎం నరసింహారావు, ఏ కోదండ రామారావు, కొత్త రాణి, కొత్త చంద్రశేఖర్, సామల మల్లికార్జునరావు, బొడ్డు మహేష్ తదితరులు పాల్గొన్నారు.




## 20 ఏళ్లుగా శ్రీ సిద్ధివినాయక స్వామికి ఆర్గానిక్ కొబ్బరి నూనె సమర్పణ

### నవరాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో 9 కిలోల కొబ్బరి నూనె సమర్పించిన ఆర్. నరేష్ కుమార్

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లోని శ్రీ శృంగేరి పీఠంలో కొలువై ఉన్న శ్రీ సిద్ధివినాయక స్వామివారికి గత 20 సంవత్సరాలుగా నవరాత్రుల సందర్భంగా ఆర్. నరేష్ కుమార్ ఆర్గానిక్ కొబ్బరి నూనెను సమర్పిస్తూ తన భక్తిని చాటుకుంటున్నారు.ప్రతి సంవత్సరం నవరాత్రుల సందర్భంగా స్వామివారికి 9 కిలోల ఆర్గానిక్ కొబ్బరి నూనెను సమర్పించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం కూడా శ్రీ సిద్ధివినాయక స్వామివారికి 9 కిలోల ఆర్గానిక్ కొబ్బరి నూనెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు.ఈ సందర్భంగా ఆర్. నరేష్ కుమార్ మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా నవరాత్రుల సందర్భంగా స్వామివారికి కొబ్బరి నూనె సమర్పించడం తనకు ఎంతో ఆనందంగా, ఆధ్యాత్మికంగా భావిస్తున్నానని తెలిపారు. భగవంతుని అనుగ్రహంతో ఈ సంప్రదాయాన్ని భవిష్యత్తులో కూడా కొనసాగిస్తానని అన్నారు.ఆర్. నరేష్ కుమార్ బీజేపీ ఎండోమెంట్స్ సెల్ ధార్మిక రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్గా, శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు.ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

**ఇట్లు:**
ఆర్. నరేష్ కుమార్ (సతీష్ కుమార్)
బీజేపీ ఎండోమెంట్స్ సెల్ ధార్మిక రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్ అధ్యక్షుడు -- శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ కార్తీక్ వైస్ ప్రెసిడెంట్

# ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి: డిసిసిబి చైర్మెన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి






మునుగోడు క్రైమ్ మిర్రర్ మునుగోడు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీలోని ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మునుగోడు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిత్యం శ్రమిస్తున్నారని, ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. కష్టాల్లో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో చేయూతనిస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు.మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ధోటీ నారాయణ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి,సర్పంచులు అద్దంకి రామలింగయ్య ,కదిరే లింగయ్య,జీడిమెడ్ల సైదులు,పాపయ్య, మాలుగు శ్రీను,జీడిమెడ్ల నిర్మల , ఏర్పుల మోహన్ బాబు,దాసరి గోవర్ధన్,పాలకూరి నరసింహ గౌడ్,మాజీ ప్రజాప్రతినిధులు,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
సోమవారం 14-9-2026


# ఖమ్మం విచ్చేసిన మున్నూరు కాపు పటేల్స్ రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్‌కు ఘన స్వాగతం



ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: మున్నూరు కాపు పటేల్స్ రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్ ఖమ్మం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా అఖిల భారత అసంఘటిత కార్మికుల ఉద్యోగుల కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు సిహెచ్. విప్లవ కుమార్ పటేల్ మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో ఘనంగా సత్కరించి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సమాజం రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింత బలోపేతం కావాల్సిన అవసరంపై నాయకులు చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్నూరు కాపు యువతకు విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలు మరింత పెరగాలంటే సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. మున్నూరు కాపు సమాజ అభ్యున్నతికి కృషి చేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్ నాయకత్వంలో సమాజం మరింత శక్తివంతంగా ఎదుగుతోందని సిహెచ్. విప్లవ కుమార్ పటేల్ పేర్కొన్నారు. తెలంగాణలో మున్నూరు కాపుల హక్కులు, రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం, యువత సాధికారత వంటి అంశాలపై నిరంతరం పోరాటం కొనసాగాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజ ఐక్యతే మున్నూరు కాపుల బలం అని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేస్తే సమాజానికి మరింత గుర్తింపు, గౌరవం లభిస్తుందని నాయకులు పేర్కొన్నారు. మున్నూరు కాపు యువత సామాజిక సేవ, విద్య, రాజకీయాల్లో ముందుండి సమాజ ప్రగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు నాయకులు, యువజన ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా నాగులమ్మ ఆలయంలో పొట్ట పండగ

## ఆదివాసి సాంప్రదాయబద్ధంగా ఆదివాసి పూజారుల పూజలు

క్రైమ్ మిర్రర్,మంగపేట: మండలంలోని వాగొడ్డుగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ నాగులమ్మ ఆలయంలో ఆదివాసి పూజరులు,వడ్డెలు ఆదివాసీ సంప్రాదాయ బద్ధంగా పొట్ట పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి యొక్క స్థంభాలను,గద్దెలను శుద్ధి చేసిన అనంతరం నాగులమ్మ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామి ఇంటి నుండి డోలి వాయిద్యాల నడుమ అమ్మవారికి కొత్తగా పండిన చిరు ధాన్యాలతో నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించారు. పొట్ట పండుగలో ముఖ్య ఘట్టం పొట్ట దశలో ఉన్న వివిధ రకాల చిరు ధాన్యాలను దండలుగా కట్టి ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగులమ్మ అమ్మవారియొక్క స్తంభానికి సమ్మక్క,సారలమ్మ ఘుడికమరాజు పగిడిద్దరాజు,గోవింద రాజు ఎర్రమ్మ,పోతు రాజుల యొక్క గద్దెల మీద ఉన్న స్తంభాలకు లకు దండలను కట్టి ప్రత్యేక పూజలు చేశారు .ఇలా చేయడాన్ని "ఎన్ను"కట్టడం గా పిలుస్తారు. అనంతరం ఆదివాసి పూజారులు ఆలయ ప్రాంగణంలో డోలి వాయిద్యాల నడుమ జాగారం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ మేనేజింగ్ ట్రస్ట్ ,ఆలయ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామి ఆధ్వర్యంలో



జరగగా,నాగులమ్మ ప్రధాన పూజారి బాడిశ నాగ రమేష్,నవీన్,వడ్డెలు సోడి సత్యం,కుర్సంపుల్లయ్య,మడకం రమేష్,మడకం రాజేష్,చౌళం శాంత,కుర్సం వీరమ్మ,భవాని,మడకం నాగమణి,సంధ్య,సుప్రజ సోడి శ్రీను,కుర్సం నాగ సాంబయ్య పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు

# జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 6,013 కేసుల పరిష్కారం

## ప్రజలకు త్వరిత న్యాయం అందించడమే లక్ష్యం

### జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్): ఈ నెల 12న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా, నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కేసుల పరిష్కారంలో పోలీస్ శాఖ, న్యాయ విభాగం, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో, పనిచేసి విశేష ఫలితాలు సాధించాయి. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా, జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లావ్యాప్తంగా, 6,013 కేసులు విజయవంతంగా పరిష్కరించబడ్డాయి. వీటిలో 3,121 డీడీ కేసులు, 2,208 ఈ–పెట్టీ కేసులు, 672 ఐపీసీ కేసులు, 12 ఎస్ఎల్ఎల్ కేసులు ఉన్నాయి. కేసులను వేగవంతంగా పరిష్కరించడంలో పోలీస్ శాఖ, న్యాయ విభాగం, ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో,



పనిచేయడం వల్ల ఈ స్థాయిలో కేసుల పరిష్కారం సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ మాట్లాడుతూ...జాతీయ లోక్ అదాలత్ వంటి కార్యక్రమాలు ప్రజలకు త్వరిత న్యాయం అందించడంలో, ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న కేసులను పరస్పర అవగాహనతో, చట్టబద్ధంగా పరిష్కరించడం ద్వారా న్యాయస్థానాలపై, భారం తగ్గడంతో పాటు ప్రజల సమయం, ఖర్చు కూడా ఆదా అవుతాయని అన్నారు. ప్రజలు తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల, దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందగలరని జిల్లా ఎస్పీ తెలిపారు. భవిష్యత్తులో నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాల్లో కూడా ప్రజలు చురుకుగా పాల్గొని, అందుబాటులో ఉన్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది, న్యాయవాదులు, సంబంధిత శాఖల ప్రతినిధులు సమన్వయంతో, పనిచేయడం వల్లే ఈ స్థాయిలో కేసుల పరిష్కారం సాధ్యమైందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాల్లో, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

# మాక్ అసెంబ్లీని ఖండించిన గోలి నరేష్



చిట్యాల క్రైమ్ మిర్రర్: చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గోలి నరేష్ ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ శాసనసభ నుంచి సస్పెండ్ అయిన బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలను హేళన చేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే ల సభ్యత్వాన్ని రద్దు చేయాలి అదేవిధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల్సిన సమస్యలను పక్కనపెట్టి ప్రతిపక్ష నేతగా ఉన్న కెసిఆర్ ఫామ్ హౌస్కు పరిమితం కావడం చాలా దురదృష్టకరం మీ పాలన ఎలా ఉంటుందో ప్రజలందరికీ తెలిసిపోయి ఎమ్మెల్యే ఎలక్షన్ లో పార్లమెంట్ ఎలక్షన్లలో నాలుగు కోట్ల ప్రజలు బుద్ధి చెప్పారని కోరారు మొన్న అసెంబ్లీ గేటు వద్ద దీక్ష చేస్తూ దళిత స్పీకర్ అయినటువంటి గడ్డం ప్రసాద్ గారిపై బూతులు మాట్లాడి సిగ్గుతోని తల దించుకొని ఉండవలసిన ఎమ్మెల్యేలు మాక్ అసెంబ్లీ ప్రోగ్రాం పెట్టి జోకులు వేసుకుంటూ స్వీకరణ ను వెక్కిరించుకుంటూ సీఎం హోదాలో వ్యక్తిని వేలన చేస్తూ మాట్లాడుతున్నారు బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేలు లక్షల కోట్ల రూపాయల ను దుర్వినియోగం చేశారని నాలుగు కోట్ల ప్రజలు మీ బి ఆర్ ఎస్ పార్టీని ఓడించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి తాటికొండ సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ నాయకులు అంశాల శ్రవణ్ కుమార్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉమ్మెత్తల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

# రామప్ప దేవాలయంను సందర్శించిన ఎంసిహెచ్ ఆర్ డి లో శిక్షణ పొందుతున్న గ్రూప్ 2 అధికారులు





వెంకటాపూర్ (రామప్ప ), క్రైమ్ మిర్రర్ : మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని ఆదివారం హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న గ్రూప్ 2 అధికారులు భారత్ దర్శన్ లో భాగంగా రామప్ప దేవాలయంను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్య కిరణ్, టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ లు ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం గురించి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, ఎంసిహెచ్ఆర్డి అధికారులు,, టూరిస్ట్ పోలీసులు అరుణ్, శ్రీకాంత్, దశరథ్, రెవెన్యూ, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.



# ఆదర్శ పాఠశాల వసతి గృహానికి వినాయక విగ్రహాన్ని అందించిన పూర్వ విద్యార్థులు

చౌటుప్పల్, క్రైమ్ మిర్రర్:- యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆదర్శ వసతి గృహానికి 2023 –25 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు వినాయక చవితి సందర్భంగా తాము చదువుకున్న వసతి గృహాన్ని మరచి పోకుండా ప్రస్తుత విద్యార్థులు బాగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ వినాయక విగ్రహాన్ని బహుమతిగా ఆదివారం వసతి గృహ వార్డెన్ మల్లికకు వారి చేతుల మీదుగా అందజేసి వసతి గృహం పట్ల వారికి ఉన్న అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ మల్లిక పూర్వ విద్యార్థులు కే దీపిక,బి కీర్తి, ఆర్ నవ్య శ్రీ, బి రాజేశ్వరి, వై అఖిల, టి అఖిల, ఆర్ శ్రీహర్షిత,ఏ వర్షిణి, ఏ అంకిత లను అభినందించారు.

# ఎంబీఏ విద్యార్థులకు దిశానిర్దేశం

## గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో అవగాహన కార్యక్రమం





చిట్యాల క్రైమ్ మిర్రర్: రంగారెడ్డి గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్ సాంకేతిక ప్రాంగణంలోని నిర్వహణ అధ్యయనాల పాఠశాల ఆధ్వర్యంలో నూతన ఎంబీఏ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ ఉపాధ్యక్షుడు సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, మేనేజింగ్ డైరెక్టర్ డా. హెచ్.ఎస్. సైనీ, డైరెక్టర్ డా. ఎస్. శ్రీనాథ్ రెడ్డి, ఎంబీఏ విభాగాధిపతులు డా. రవి శంకర్ కుమ్మెట, డా. మధుసూధన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంబీఏ విద్యతో నాయకత్వ లక్షణాలు, సంభాషణ నైపుణ్యం, నిర్ణయ సామర్థ్యం, సమస్యల పరిష్కార నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు కృత్రిమ మేధస్సు, సమాచార విశ్లేషణ, ఆర్థిక సాంకేతికత, డిజిటల్ మార్పులు, నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు కోర్సు విధానం, విద్యా ప్రణాళిక, ఉద్యోగ అవకాశాలు, విద్యార్థుల అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం నూతన విద్యార్థుల్లో భవిష్యత్ విద్యా, ఉద్యోగ ప్రయాణంపై నమ్మకాన్ని పెంచింది.

# నిరుపేద కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మున్సిపల్ చైర్మన్

చిట్యాల క్రైమ్ మిర్రర్: చిట్యాల మున్సిపాలిటీ 3వ వార్డుకు చెందిన పెరమండ్ల మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె పార్థివదేహానికి మాజీ మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకట్ రెడ్డి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ గాలి యాదమ్మ లింగయ్యతో పాటు కాలనీవాసులు పాల్గొని మల్లమ్మకు నివాళు లర్పించారు.



# ఎక్కడి చెత్త అక్కడే... డంపింగ్

**నిర్లక్ష్య ధోరణిలో మున్సిపల్ సిబ్బంది**

**డంపింగ్ యార్డ్ ఉండగా రోడ్ల పక్కన చెత్త డంపింగ్**

**కొరవడిన అధికారుల పర్యవేక్షణ**

**బాధ్యతారాహిత్యంగా మున్సిపల్ సిబ్బంది**

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై వేటు వేయాలని పుర ప్రజల డిమాండ్**



**క్రైమ్ మిర్రర్,నేరేడుచర్ల** చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దు, బుట్టలో గాని సంచల్లో గాని తడి చెత్తను, పొడి చెత్తను వేరువేరుగా తెచ్చిఇవ్వండి. అని చెత్త బండి మైకులో చెప్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డు నర్సాయిగూడెంలో సేకరించిన చెత్తను నర్సాయిగూడెం లోనే రోడ్డు పక్కన డంపింగ్ యార్డ్ లాగా చెత్తను పోయటం పలువురికి ఆశ్చర్యం కలిగిస్తుంది. చెప్పేది ఒక్కటి చేసేది ఇటువంటి పని అని పుర ప్రజలు అంటున్నారు.వివరాల్లోకెళ్తే నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ లో డంపింగ్ యార్డు ఉండగా అక్కడ చెత్తను వేయటం ఓపిక సమయం లేక బద్ధకంగా ఎక్కడ సేకరించిన చెత్తను అక్కడనే వదిలేయడం మున్సిపల్ సిబ్బందికి అలవాటుగా మారిందని, అధికారుల పర్యవేక్షణ లేక వారి ఇష్టారాజ్యంగా చెత్తను ఎక్కడపడితే అక్కడే రోడ్ల పక్కన వేసి తర్వాత నిప్పు పెట్టడం, పొగతో వాహనదారులకు ఇబ్బంది కలిగించటం మునిసిపాలిటీ సిబ్బందికి పరిపాటి అయిందనీ, పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో మిర్యాలగూడ రోడ్డులో ఎన్టీఆర్ నగర్ దగ్గర రోడ్డు పక్కన మున్సిపాలిటీ సిబ్బంది చెత్తను వేసి నిప్పు పెట్టేవారు. పొగ, దుర్గంధముతో రోడ్డుపై వెళ్లే వాహన దారులకు తీవ్ర ఇబ్బంది కలిగించే వారు. నాడు పత్రికలలో వార్తలు రావడంతో అప్పటి మున్సిపల్ కమిషనర్ ఆ విషయంపై చర్యలు తీసుకున్నారు. ప్రత్యేకంగా డబ్బింగ్ యార్డ్ ఉండగా సేకరించిన చెత్తను ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కన ఎందుకు పోయాల్సి వస్తుందో ఆశ్చర్యం కలిగిస్తుందని పలువురు విమర్శిస్తున్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీ చెత్తను తీసుకొచ్చి ఐదవ వార్డు నరసయ్య గూడెంలో రోడ్డు పక్కన వేయటం వల్ల దుర్గంధం వస్తుందని,పాత నేరేడుచర్ల లో ఉన్న డంపింగ్ యార్డుకు తరలించాలని పలువురు కోరుతున్నారు.ఈ చెత్త తరలింపు విషయం మున్సిపల్ కమిషనర్ కు తెలిసి జరుగుతున్నాదా లేక సిబ్బంది సొంత నిర్ణయం తీసుకుంటున్నారా అనే విషయంలో స్పష్టత లేదు. సమస్యను పరిష్కరిస్తారా.. అలాగే వదిలేస్తారా వేచి చూడాలి.

# అందరూ మట్టి వినాయకులనే పూజించాలి

**సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు మట్టి వినాయకుల ఉచిత పంపిణీ**



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్‌పల్లి పట్టణంలో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు మట్టి వినాయకుల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి నరేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని పిలుపునిచ్చారు. మట్టి వినాయకుల వినియోగంతో చెరువులు, నీటి వనరులు కాలుష్యం కాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ ఉదయాన్నే 7:30 గంటలకు మా పాల షాపు వద్దకు వచ్చి మట్టి వినాయకులను స్వీకరించి, కార్యక్రమానికి సహకరించి విజయవంతం చేయాలని నరేష్ కుమార్ కోరారు.

# వినాయక మండపాన్ని ప్రారంభించిన కాట సుధా శ్రీనివాస్ గౌడ్





అమీన్‌పూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 13: అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని నవ్య గోకులంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. అమీన్పూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, విజయ్ తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన మండపాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

# ఫతేపూర్ సమీపంలో వ్యక్తి మృతి

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్‌పల్లి పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన అల్లం దుర్గయ్య (47) మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గయ్య చెత్త సేకరణ వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత మూడు సంవత్సరాలుగా మధుమేహంతో బాధపడుతున్న ఆయన, ఆరోగ్య సమస్యల కారణంగా గత మూడు నెలలుగా ఇంటికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో మానసిక ఒత్తిడికి గురైనట్లు పోలీసులు తెలిపారు.ఆదివారం ఉదయం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లిన దుర్గయ్య ఫతేపూర్ సమీపంలోని ఓపెన్ ప్లేస్‌కు వెళ్లి తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు, స్థానికుల సమాచారంతో ఆయనను చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శంకర్‌పల్లి పోలీసులు తెలిపారు.ఘటనపై శంకర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# రావిర్యాల వండర్ల సమీపంలో కేఫ్ మన్నాలో నీళ్ల చాయ్ దందా...!

**ఒక కప్పు చాయి 25 రూపాయలకు అమ్ముతున్న వైనం..!**

**చాయి ఇలా ఉందని వినియోగరరులు అడిగితే**

**మాస్టారు కొత్తగా వచ్చారని పొంతన లేని సమాధానం...**

**వండర్లా సమీపంలోని కేఫ్ మన్నా హోటల్ పై ప్రజల ఆగ్రహం**

**క్వాలిటీ లేని చాయ్ తో మోసం**

**నిఘా వ్యవస్థ నిద్రిస్తే.... క్రైమ్ మిర్రర్ కాపు కాస్తుంది.**




**(మహేశ్వరం ప్రతినిధి క్రైమ్ మిర్రర్):** నగర శివారులోని రావిర్యాల – వండర్ల వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న కేఫ్ మన్నా హోటల్ లో నాసిరకం చాయ్ అమ్ముతూ ప్రజలను మోసం చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఆదివారం ఈ హోటల్ కు వెళ్లిన కొందరు యువకులకు ఇచ్చిన చాయ్ పూర్తిగా నీళ్లలా పల్చగా, ఎలాంటి టేస్ట్ లేకుండా ఉందని, ప్లేట్ లో పోసి చూస్తే నీళ్లకు, చాయ్ కు తేడా లేకుండా ఉందని వినియోగరరులు ఆరోపించారు.ఇలాంటి నీళ్ల చాయ్ కి ఏకంగా రూ.25 వసూలు చేస్తున్నారని మండిపడుతున్నారు.ఒకప్పుడు ఇరానీ చాయ్ అంటేనే మంచి క్వాలిటీకి పేరు, కానీ ఇక్కడ మాత్రం రేటు ఎక్కువ, క్వాలిటీ తక్కువ అని, వండర్ల కు వెళ్లే వారిని టార్గెట్ చేసుకుని ఇలా దోపిడీ చేస్తున్నారని స్థానికులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వండర్ల అమేజింగ్ పార్క్ పక్కన ఉన్న హోటల్స్ పై ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు దృష్టి సారించి తనిఖీలు చేసి, ఇలా తక్కువ క్వాలిటీతో ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్న కేఫ్ మన్నా వంటి హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





# తెలంగాణ ధనిక రాష్ట్రం.. అది రోశయ్య చలవే: సీఎం రేవంత్ రెడ్డి

**తెలంగాణ మిగులు బడ్జెట్‌కు రోశయ్య ముందుచూపే కారణమన్న రేవంత్ రెడ్డి**

**రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇచ్చిందని వెల్లడి**

**తన ఎదుగుదలకు రోశయ్య సలహా ఇచ్చారని గుర్తుచేసుకున్న సీఎం**

**హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహ ఏర్పాటును సమర్థించిన రేవంత్**

**ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రభుత్వ సాయం**



తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.16,000 కోట్ల మిగులు బడ్జెట్‌తో ఆవిర్భవించిందంటే, ఆ ఘనత పూర్తిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రోశయ్య ముందుచూపు వల్లే 2014 జూన్ 2న తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఏర్పడిందని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇచ్చిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెన్నారెడ్డి, విజయభాస్కర రెడ్డి, వై.ఎస్. రాజశేఖర రెడ్డి వంటి ముఖ్యమంత్రులు రాష్ట్ర ఖజానా బాధ్యతలను ఆర్యవైశ్యులకే అప్పగించారని తెలిపారు. రోశయ్య అత్యధిక కాలం ఆర్థిక మంత్రిగా పనిచేసి, 16 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనతను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. తాను శాసనమండలిలో దూకుడుగా మాట్లాడినప్పుడు, రోశయ్య తనను పక్కకు పిలిచి కోపాన్ని తగ్గించుకుని అనుభవంతో ముందుకు వెళ్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటావని సలహా ఇచ్చారని వెల్లడించారు. రోశయ్య ఎప్పుడూ కఠినంగా విమర్శించలేదని, తన చతురత, వాగ్ధాటితోనే పదునైన వ్యాఖ్యలు చేసేవారని అన్నారు. హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటును కొందరు విమర్శించారని, కానీ నాలుగు దశాబ్దాల క్రితమే హైదరాబాద్‌కు వచ్చి, కష్టసుఖాల్లో ఇక్కడే ఉంటానని చెప్పిన ఆయన మాటకు గౌరవమిచ్చి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి వివరించారు.ఆర్యవైశ్యులు సౌమ్యులని, ఆత్మగౌరవం, ముందుచూపు, విజ్ఞత వారి డీఎన్ఏలోనే ఉన్నాయని సీఎం ప్రశంసించారు. ఎంతోమంది పేదరికంలో ఉన్నా, ఆత్మగౌరవానికి విలువిచ్చి తమను పేదవారిగా చెప్పుకోవడానికి ఇష్టపడరని అన్నారు.


Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.